ఎడతెరిపి లేని వర్షం.. అంతా జలమయం

- పెద్దాపురం అర్బన్, రూరల్‌లలో ప్రజల అవస్థలు
- విద్యుత్ సరఫరా లేక తప్పని తాగునీటి ఇక్కట్లు
- నేలకొరిగిన చెట్లు, అరటి తోటలు, విద్యుత్ స్తంభాలు


వడ్లమూరులో నేలకొరిగిన అరటి తోట


చదలాడ రోడ్డులో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

పెద్దాపురం: ఎడతెరిపి లేని వర్షం పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాలను అతలాకుతలం చేసింది. శుక్రవారం వేకువజాము నుంచి వాతావరణ పరిస్థితులు ఇటు రైతులు, అటు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో చాలా చోట్ల భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఈదురుగాలులు వీచడంతో ఎక్కడిక్కడే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సెలవును ఆలస్యంగా ప్రకటించడంతో విద్యార్థులు వర్షంలోనే స్కూళ్లకు వెళ్లి ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల సేవలు నిలిచిపోయాయి. ప్రధానంగా ఏటిపట్టు ప్రాంతంలోని వడ్లమూరు నుంచి గోరింట, పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి, చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, మర్లావ, తూర్పుపాకల గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడ్డారు. భారీ స్థాయిలో అరటి పంట నేలకొరగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారు. మరికొన్ని చోట్లు విద్యుత్ సరఫరా పునరుద్ధరించేంత వరకు తాగు నీటి ఇబ్బందులు ఎదుర్కొనవలసి వచ్చింది. అల్పపీడన ద్రోణి కారణంగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు కొన్ని చోట్ల ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి కనబడలేదు.

సచివాలయ మహిళా పోలీసుల సమస్యలు పరిష్కరించాలి


ఎస్పీని కలిసిన సచివాలయ రాష్ట్ర యూనియన్ నాయకులు

సామర్లకోట: గ్రామ, వార్డు సచివాలయాలల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసుల సమస్యలు పరిష్కరించాలని సచివాలయ గ్రామ వార్డు రాష్ట్ర యూనియన్ నాయకులు విప్పర్తి నిఖిల్‌కృష్ణ, దారపురెడ్డి తాతాజీరావు, షేక్ మహబూబ్ బాషా, కె.సుబ్బిరామిరెడ్డిలు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం సాయంత్రం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మహిళా పోలీసుల సమస్యపై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సచివాలయ మహిళా పోలీసులకు వార్షిక ఇంక్రిమెంట్లు, మెటర్నిటీ సెలవులు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ల నుంచి సమాచారం వచ్చిన వెంటనే వాటిని పరిష్కరిస్తామని చెప్పారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ యూనియన్ ప్రతినిధులు సత్తిబాబు, వి సతీష్‌లు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్ మృతికి సంతాపంగా దుకాణాల మూసివేత

సామర్లకోట: ఎరువుల డీలర్ మృతికి సంతాపంగా శుక్రవారం మండల పరిధిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాను మూసివేశారు. అచ్చంపేట గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీగణపతి ఫెర్టిలైజర్ షాపు యజమాని యండమూరి వీర వెంకట సత్యనారాయణమూర్తి (కాపు) శుక్రవారం మృతి చెందారు. దాంతో మండల ఎరువులు, పురుగుమందుల షాపుల యూనియన్ అధ్యక్షుడు మండవిల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో షాపులు మూసివేసి సంతాపం తెలిపారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి ఉత్సవాలు


సామర్లకోటలో బాబా పారాయణ చేస్తున్న మహిళలు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని శిర్డీ సాయి ఆలయంలో శుక్రవారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నాయకులు దన్నాల అప్పారావు, జి.సత్యనారాయణ, బర్లంకి రామారావు తదితరుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబా వారిని దర్శించుకున్నారు. శనివారం మధ్యాహ్నం బాలికలచే కోలాటం, అనంతరం బాబాకు పల్లకి ఊరేగింపు ఉంటుందని, ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, 11 గంటలకు రైల్వే కల్యాణ మండపంలో భారీ అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

అనాథలకు ఆహార పొట్లాల పంపిణీ



గొల్లప్రోలులో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పిఠాపురం: గొల్లప్రోలు పట్టణంలో అనాథలు, వృద్ధులు, వికలాంగులకు శుక్రవారం అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు మాట్లాడుతూ వాతావరణం పరిస్థితుల కారణంగా ఆకలితో అలమటిస్తున్న వృద్ధులు, వికలాంగులు, అనాథలకు తమ వంతుగా ఒక పూట భోజనం, తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నుంచి ప్రతిరోజూ అనాథలకు ఒకపూట ఆహారం ప్యాకెట్‌లు, తాగునీరు పంపిణీ చేస్తామన్నారు. మదర్ థెరిసా స్ఫూర్తితో చేపట్టిన ఈ అహార పంపిణీకి ప్రతిఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు డి.నారాయణమూర్తి, గుడాల చార్లెస్, కేసవరపు వీరన్న, గొర్ల శివ, అక్కిరెడ్డి సురేష్, కాదా బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం నుంచి అరుణాచలానికి బస్సు సర్వీసు

జగ్గంపేట: ప్రతి నెలా పౌర్ణమికి అరుణాచలంలో జరిగే గిరిప్రదక్షిణకు ఏలేశ్వరం ఆర్టీసీ డిపో నుంచి బస్సు సర్వీసు నడుపుతున్నట్లు ఆ డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. జగ్గంపేటలో అరుణాచలం వెళ్లే బస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రయాణికులకు అరుణాచలం గిరిప్రదక్షిణతో పాటు శ్రీకాళహస్తి, కంచి, కాణిపాకం, విజయవాడ తదితర పుణ్యక్షేత్రాలను చూపిస్తారన్నారు. ఏపీఎస్ఆర్టీసీ కల్పించిన ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్టీసీ సిబ్బందికి రక్షణ కల్పించాలని వినతి

గోకవరం: ఆర్టీసీ సిబ్బందికి రక్షణ కల్పించాలని స్థానిక ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రామన్నకు వినతి పత్రం అందజేశారు. కొందరు రాత్రి సమయంలో విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై భౌతిక దాడికి పాల్పడుతూ ఆర్టీసీకి, సిబ్బందికి నష్టం చేకూరుస్తున్నారన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకుని దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆర్టీసీ సిబ్బందికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ చైర్మన్ పైడిమళ్ల లక్ష్మణ్, సెక్రటరీ అక్కిరెడ్డి కృష్ణ, చీకట్ల వెంకటేష్, బీఎస్ నారాయణ, డి.చంద్రశేఖర్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు ఉపాధ్యాయుల రమేష్, కోట వంశీ, ఫణిశర్మ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 24 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పొలాలు

- ముంపును పరిశీలించిన జెడీ
- నీరు బయటకు పంపాలని సూచన


మామిళ్లదొడ్డి గ్రామంలో నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న జేడీ, వ్యవసాయాధికారులు

సామర్లకోట: మండల పరిధిలో అనేక గ్రామాలలోని వరి నారుమళ్లు, నాట్లు వేసిన పొలాలు నీటిలో మునిగిపోయాయి. గత వారం రోజులుగా వర్షాలు కురుస్తూ ఉండటం, దీనికి తోడు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. దాంతో మండల పరిధిలో వీకే రాయపురం, ఉండూరు, మామిళ్లదొడ్డి, వల్లూరు, కొప్పవరం, అచ్చంపేట గ్రామాల్లో వరి పొలాలను జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డెరెక్టరు ఎస్.విజయకుమార్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల రాబోయే రెండు రోజుల్లో మరింత ఎక్కువగా వర్షాలు పడే అవకాశం ఉందని రైతులకు తెలిపారు. ఈ మేరకు వరినాట్లకు చెందిన పొలాల్లో నీరు బయటకు పోయేలా పంట కాలువను శుభ్రం చేసుకోవాలన్నారు. ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వలన కొత్త ఆకు వచ్చి ఊడ్పులకు అందుతుందని తెలిపారు. అలాగే ఊడ్చిన, వెదజల్లిన పొలాల్లో నీరు బయటకు పంపేలా చూడాలన్నారు. పంట ఊడ్చిన తరువాత పిలక దశలో ముంపునకు గురైతే నీటిని పూర్తిగా బయటకు తీసి ఎకరాకు 20 కిలోల యూరియా 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలని చెప్పారు. ఈ విధంగా బూస్టర్ డోసు వేసుకోవడం వల్ల మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కొలుకొంటుందన్నారు. మండల పరిధిలో వెదజల్లు ద్వారా 30 హెక్టార్లు, నారుమడి ఐదు హెక్టార్లు నీట మునిగినట్లు గుర్తించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఐ సత్య, ఏఈఓ ఎంవీ సతీష్, వీఏఏలు సారిక, తేజ, రమణ, రైతులు పాల్గొన్నారు.

‘భోజనాన్ని’ సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ-2 పుల్లయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో పీఎం పోషణ్ పేరిట ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ-2 పి.పుల్లయ్య అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్న స్వచ్ఛంద సంస్థ భోజనాన్ని నాసిరకంగా వండుతోందని వస్తున్న ఫిర్యాదుల మేరకు భోజనాన్ని రుచి చూసి పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన భోజన పథకం రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. హెచ్ఎం మీనా మాధురి, ఉపాధ్యాయులు హనుమంతురావు, ప్రకాష్, సీఆర్పీలు పాల్గొన్నారు.

10వ తరగతికి పునాది వేసుకోవాలి
ఎంఈఓ శివరామకృష్ణయ్య


మాధవపట్నంలోని హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: 10వ తరగతిలో మంచి ఉతీర్ణత సాధించడానికి ఎనిమిదో తరగతి నుంచే పునాది వేసుకోవాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలో మాధవపట్నం హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ప్రభుత్వ హైస్కూల్‌లో 100 శాతం ఉతీర్ణత సాధించడంతో పాటు ‘గ్రేడ్-ఎ’లు పెరగాలని సూచించారు. 8వ తరగతి నుంచి పాఠ్యాంశాలపై దృష్టి సారిస్తే విజయం సులభతరం అవుతుందని చెప్పారు. ఈ మేరకు ఉపాధ్యాయులు వెనుక బడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇటీవల ప్రకటించిన ట్రిపుల్ ఐటీలో మండల పరిధిలో 16 మంది విద్యార్థులు ఎంపికవగా 14 మంది ప్రభుత్వ పాఠశాలల వారేనని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల పుస్తకాలను పరిశీలించి వారి నుంచి సమాచారం సేకరించారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు.

మరిడమ్మ తల్లికి కుంకుమ పూజలు


మరిడమ్మ తల్లికి కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెద్దాపురం: ఆషాఢ మాసంలో ఏటా నిర్వహించే పెద్దాపురం మరిడమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

రైల్వే గేటు మీదుగా యథావిధిగా రాకపోకలు


గోపాలపట్నంలో రైల్వే గేటు తెరచుకోవడంతో యథావిధిగా సాగుతున్న వాహనాల రాకపోకలు

తొండంగి: మండలంలోని గోపాలపట్నం రైల్వేగేటు ట్రాక్ మరమ్మతుల పనులు పూర్తయ్యాయి. అధికారులు రైల్వే గేటును తెరవడంతో యథావిధిగా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ నెల 15 నుంచి 18 వరకూ ట్రాక్ మరమ్మతుల నిమిత్తం రైల్వేగేటును అధికారులు మూసివేశారు. దీంతో వాహనదారులు నాలుగు రోజుల పాటు పి.ఇ.చిన్నాయపాలెం, రావికంపాడు రైల్వేగేట్లు ద్వారా రాకపోకలు సాగించి ఇబ్బందులు పడ్డారు. కాగా రెండు రోజుల పాటు కుండపోత వర్షం వల్ల ట్రాక్ పనులకు అంతరాయం కలిగినప్పటికీ ఎట్టకేలకు అధికారులు గోపాలపట్నం రేల్వే గేటుకు మరమ్మతులు పూర్తి చేసి వాహనాల రాకపోకలను పునఃప్రారంభించారు. గేటు వద్ద ట్రాక్ దాటేందుకు వాహనాలు వెళ్లే మార్గంలో తారు రోడ్డు వేయాల్సి ఉంది. దీంతో వాహనాల రాకపోకలు ట్రాక్ వద్ద నెమ్మదిగా సాగుతున్నాయి.

వరివడిగా సాగుతూ...

- వర్షాలతో ఊపందుకున్న ఖరీఫ్ సాగు
- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీ


నాట్లు వేసేందుకు దమ్ము మడిని చదును చేస్తున్న రైతు

పిఠాపురం: నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. అప్పపీడన ప్రభావంతో కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఖరీఫ్ పనులను ముమ్మరం చేశారు. ఇప్పటికే నారు పోసే పనులు ఒక కొలిక్కి రావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు సాగు పనుల్లో బిజీగా ఉన్నారు. నియోజకవర్గంలో పల్లపు భూములతో పాటు మెట్ట ప్రాంతం ఉంది. ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలో 40 వేల ఎకరాల్లోనూ, చెరువుల కింద 7 వేల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. కాగా గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాల్లో వరి నారుమళ్ల పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే నీరు అందుబాటులో ఉన్నచోట రైతులు నారుమళ్లు వేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో అన్ని ప్రాంతాల్లో నారుమళ్లు సిద్ధం చేసే పనిలో కర్షకులు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది వెదజల్లు పద్ధతిలో సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. కొన్నిచోట్ల ఊడ్పులకు పొలాలను సిద్ధం చేస్తున్నారు.

నారుమళ్లు సిద్ధం

నియోజకవర్గంలో ఇప్పటివరకూ సుమారు 75 శాతానికి పైగా నారుమళ్లు వేసే పనులు పూర్తయ్యాయి. సుమారు 50 శాతం నాట్లు వేసేందుకు నారు సిద్ధమైంది. నారు ఎదిగిన చోట నాట్లు వేసే పనులు ఊపందుకున్నాయి. ముఖ్యంగా పీబీసీ శివారు ప్రాంతాల్లో వర్షాల వల్ల సాగునీటి ఎద్దడి లేకపోవడంతో రైతులు నాట్లు పనులు వేగవంతం చేశారు. ఈ నెలాఖరుకు 70 శాతానికి పైగా నాట్లు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులను సిద్ధం చేశారు. వ్యవసాయ శాఖ సహాయకులు గ్రామాల్లో రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

మినీ గోకులాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

రౌతులపూడి: మండలంలో మినీ గోకులాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు మండల పశువైద్యాధికారి ఎం.వీరరాఘవరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు పశువుల గల మినీ గోకులం ఏర్పాటుకు యూనిట్ విలువ రూ. 1.15 లక్షలన్నారు. దీనిలో ఉపాధి హామీ నిధులు రూ.1.35 లక్షలు కాగా రైతు వాటా కింద రూ.11,500 చెల్లించాల్సి ఉందని తెలిపారు. నాలుగు పశువుల మినీ గోకులం ఏర్పాటుకు రైతు వాటా రూ.18,500 చెల్లిస్తే మిగిలినవి ఉపాధి హామి నిధుల నుంచి ఏర్పాటు చేస్తారన్నారు. ఆరు పశువుల మినీ గోకులం ఏర్పాటుకు యూనిట్ విలువ 2.30 లక్షల కాగా రైతు వాటా రూ.23,000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, వలస, డీనోటిఫైడ్ తెగలవారు, దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వారు, మహిళా యజమాని, అంగవైకల్య యజమాని గల కుటుంబాలకు చెందినవారు, చిన్న, సన్నకారు రైతులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల పాడిరైతులు మండల పశువైద్యశాల లేదా స్థానిక సచివాలయంలో సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


కొత్తూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. మండలంలోని కొత్తూరులో ప్రజలకు శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదని, లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్ల లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. దోమల నియంత్రణకు దోమల తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


రవీంద్రపురంలో పర్యటించిన జిల్లాస్థాయి అధికారులు


రవీంద్రపురంలో మురుగునీరు పోయేందుకు కచ్చా డ్రైన్ తవ్వుతున్న దృశ్యం

సాక్షి ఇంపాక్ట్

కొత్తపల్లి: స్థానిక రవీంద్రపురంలో సమస్యలు తిష్టవేశాయి. దీనిపై రవీంద్రపురం-సమస్యల నిలయం అనే శీర్షికతో ఇటీవల ‘సాక్షి’లో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ కథనానికి జిల్లా, పంచాయతీ అధికారులు స్పందించారు. పూడికపోయిన డ్రైన్ల పూడిక తీయించారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. కచ్చా డ్రైన్లు తవ్వించారు. స్థానిక ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. ట్యాంక్ చుట్టూ మురుగునీరు, గడ్డిని తొలగించారు. సమస్యలు పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి


చినశంకర్లపూడిలో నీట మునిగిన నారుమడి

ప్రత్తిపాడు: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నారుమడులు, పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యింటి వీర గంగాధర్ సూచించారు. మండలంలోని ప్రత్తిపాడు, రాచపల్లి తదితర గ్రామాల్లో వరి నారుమడులు, పంట పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలిచ్చారు. విత్తనాలు చల్లిన పొలంలో మూడు రోజుల కన్నా ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. వీలైనంత వరకు నీటిని పూర్తిగా బయటకు తీసివేయాలని సూచించారు. దీని వల్ల విత్తనం గాలి పోసుకుని, త్వరగా మొలక వస్తుంది. పూర్తిగా నీట మునిగితే మళ్లీ విత్తనాలు చల్లుకోవాల్సి ఉంటుందన్నారు. నెలరోజుల వ్యవధిలోపు ఉన్న నారుమళ్లలో నీరు బయటకు తీసేసి, ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలని సూచించారు.

300 ఎకరాల్లో వరిసాగు

ప్రత్తిపాడు: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు రైతాంగానికి కాస్త ఊరట నిచ్చాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకూ ఆశించిన మేర వర్షాలు కురవలేదు. దమ్ములు చేసేందుకు సరిపడా తడి లేకపోవడంతో అధికశాతం రైతాంగం వెదజల్లు పద్ధతిలోనే సాగుకు ఉపక్రమించారు. ప్రత్తిపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ఏలూరు, బవురువాక, బురదకోట, ఉలిగోగులు, దోపర్తి, తాడువాయి తదితర గిరిజన గ్రామాల్లో వెదజల్లు పద్ధతిలో సాగు చేపట్టారు. వర్షాలకు రైతులు సాగు పనులను ముమ్మరం చేశారు.